# ముక్తి కోసం

**కళ్లు** మూసుకు పడుకున్నాడు నారాయణ. మామూలుగా అయితే ముద్ద దిగగానే మంచం మీద నడుం వాల్చడం తరవాయి కునుకు తీసేవాడు. పెంకుటింటి అరుగు చల్లగానే ఉంది. గోడ కిటికీ రెక్కలు మూసి ఉన్నాయి. గోడ అక్కడక్క బెల్లులూడి ఉన్నాయి. కిటికీ పక్కనే వెంకటేశ్వరస్వామిగా ఎన్టీ రామారావు వెలిసిపోయి గుర్తుపట్టడం కష్టంగా ఉంది. కిటికీ రెక్కల సన్నటిసందులోంచి సిగరెట్టు వాసన వస్తోంది. కొడుకు భోజనం కూడా అయిందన్నమాట. నారాయణ ఒత్తిగిలి చెయ్యి తలకింద పెట్టుకున్నాడు. అటూ ఇటూ ఎత్తైన అరుగులు, లోపల వంట గది కాకుండా రెండు పెద్ద గదులు వేయించు కున్నాడు నారాయణ. కట్టినప్పుడు ఆ వీధిలో అతని ఇల్లే మొదటిది. పక్కనే కోమటి కృష్ణమూర్తి తరవాత కట్టుకున్నాడు. నారాయణకి కళ్లు మూసుకున్నా నిద్ర రావడం లేదు. కాయబారు మనిషతను. పొట్ట కాయిలా సన్నగా పొడుగ్గా ఉంటాడతను. కనుబొమ్మల మధ్యనుంచీ ఎర్రటి నామం ఎల్లవేళలా నారాయణ చిరునామాలా కనిపిస్తుంది. గుమ్మం దగ్గిర చెప్పులు చప్పుడయింది. కోటేశ్వర్రావు చొక్కాబొత్తాలు పెట్టుకుంటూ బయటికి వెళ్లిపోయాడు. ఇవాళ ఎవరిచేత చెప్పిస్తాడో. కొడుకు మీద కోపం వచ్చిందతనికి.

నిన్న సాయంత్రం పనిగట్టుకుని మేస్టారు టీ ఇచ్చి మరీ సలహా ఇచ్చేడు. ("వాడి మాట వినడంలో తప్పులేదు నారాయణ") మేస్టారు లోకం గురించీ, అందులో ఉండే కొడుకుల గురించీ మాట్లాడేడు. అంతా విని అన్నాడు నారాయణ.

"ఇప్పుడు నా కొడుకు నన్ను చూడ్డంలేదంటం లేదు గదండీ. ఆడి బతుకదీ. నా బతుకూ బావూ ఇదీ."

రెండు బీడీలు కొనుక్కుని తిన్నగా గోదావరి గట్టుకెళ్లి కూచున్నాడు నారాయణ. రావిచెట్టుకింద కూచుంటే అవతల్నించి పడవరావడం కనిపిస్తోంది. ఒడ్డుకు రాగానే నాగేశు ఎలాగూ వస్తాడు. వాళ్ల నాన్న పడవేసేవాడు. అర్థాంతరంగా పాము కరిచి చచ్చిపోయాడు. పడవ మెత్తగా ఊగుతూ సిల్కు గోదావరిని కత్తిరించుకుంటూ వస్తోంది. ఈ ఊరికోసం గోదావరి ఒంపు తిరిగి వీపు మీద రెండురేవుల మెట్లు వేయించుకుని పాపికొండల్లోకి వెళ్లిపోయింది. దరిదాపు డెభై ఏళ్లుంటాయి నారాయుడికి. మొదటి పదేళ్లూ మధ్యలో నాలుగు రోజులూ తీసేసినా అరవై ఏళ్లు గోదావరి స్నానం చెయ్యని రోజు లేదు. పడవలాగి నారాయణ దగ్గిరికి రానే వచ్చేడు నాగేశు.

"కోట్సర్రావున్నాడా? నన్నోపాలి అయిద్రాబాదు తీసుకెళ్లమని చెప్పు."

"హాయిదరాబా? ఏం పన్లేదేట్రా? ఎదవ హాయిదరాబాదు."

"నువ్వా ఎల్తన్నావంటగా?"

"ఆడు రమ్మన్నాడు. నే నెందుకెళ్తాను పోయెహె"

నాగేశు నవ్వుకుంటూ వెళ్లిపోయాడు. నారాయణకి ఒళ్లు మండిపోయింది. తువాలు భుజం మీద వేసుకుని గట్టుదిగి తులశమ్మ టీ స్టాలు కెళ్లేడు ("టీ ఎండు కాఫీ స్టాలు. ప్రొ. తులశంమ") కొమ్ముగిన్నె పొయ్యి మీద వెచ్చబడుతోంది. బిందె నీళ్లు బయట గోలెంలో పోసి మొహం తుడుచుకుంటూ వచ్చింది తులశమ్మ.

"నువ్వా నారాయణా? టీగానిమ్మంటావేటి?"

టీ గిన్నె కింద మంట ఊది నారాయణకిష్టవైన 'మంచి లైటు టీ' చేసే ప్రయత్నాలు చేస్తూ అడిగిందామె.

"అవునూ కొడుకుతో హాయిదరాబాదు వెళ్లిపోతన్నావంట నిజవేనా?"

మాట్లాడలేదు నారాయణ. టీ ఇస్తూ ఆమే మళ్లీ అంది.

"నీ కొడుకు మంచోడు గనక దగ్గిరెట్టుకుని చూసుకుందావని రమ్మంటున్నాడు. అమ్మాబాబూ ఎప్పుడు చస్తారా అని చూసేవోళ్లే ఎక్కువగా ఉన్నారు. అమ్మెళ్లిపోయిందనుకో. మన కోటేశరావు మంచోడు గనక ఇంకా అమ్మా బాబూ అనుకుంటున్నాడు ఈ రోజుల్లో."

"అదుండి నే పోయినా బావుండేది."

"అయన్నీ రాసిపెట్టినట్టు జరుగుతాయి. నీకు తెల్దేటీ?"

టీగ్లాసు పక్కన పెట్టి బీడీ వెలిగించాడు నారాయణ. ఎదురుగుండా స్టూలు మీద కూచుని గుడ్డటి మెడకి పట్టిన చెవట కొంగుతో తుడుచుకుంటూ తులశమ్మ అంది.

"ఎక్కడ ప్రేప్తం ఉంటదో అక్కడికే బోతాంగానీ, నువ్వెళ్లిపోతే ఊరు చిన్నబోద్దనుకో."

నారాయణకి ఒళ్లు జలదరించింది. మనసులో నవ్వుపుట్టి అడిగేడు.

"ఏం. అదే? పొమ్మంటున్నారందరూను."

"అన్నయాపెద్ద పండక్కి నువ్వ లేకపోతే కళే వుంది? నా చిన్నప్పట్నించీ చూస్తానే ఉన్నా. ఆ? చలవపంచీ, చేతిలో చిడతలు, తంబూరా తీసుకుని పాడతా ఊరంతా తిరిగేటోడివి. చిన్నప్పుడు నువ్వ పాడే పాట్లన్నీ సర్దాగా పాడేదాన్ని. నువ్వు లేకపోతే పండగేటింక? ఇల్లలగ్గానే పండగవుద్దా చెప్పు?"

నారాయణకి కడుపులోంచి కన్నీళ్లొచ్చేయి. తువాల్తో కళ్లొత్తుకున్నాడతను. తులశమ్మ కరిగిపోయింది.

"ఊరుకో అన్నయ్యా. పుట్టి పెరిగిన ఊరు ఒదలాలంటే ఎవరికేనా బాడే" మళ్లీ కళ్ళొత్తుకున్నాడు నారాయణ.

"ఉండు. ఉంకోపాలి టీ తాగు." అంటూ గబగబ అరగ్లాసు టీ మళ్లీ చేసిచ్చింది తులశమ్మ. లోపల అప్పటికే చీకటిగా ఉంది. రాటకి దరిదాపు వెలగడం మర్చిపోయిన బల్బు వేలాడుతోంది. లేచి లైటు వేసి మెళ్లో సూత్రాలు కళ్లకద్దుకుందామె. నారాయణ కూడా దణ్ణం పెట్టుకుని అన్నాడు.

"నా బాధ అదే. ధనుర్మాసంలో హరినామం చేస్తా బిక్షతీసుకుని ఒండుకుని తింటా. మా పెద్దలందరూ అంతే గదే. నేను తలొంచితే గిన్నెలో ఇంతవరకూ పిడికెడు బియ్యం వెయ్యని గడపలేదు. ఏడాదంతా ధనుర్మాసం కోసం బతుకుతానే చివరికి నాకీ గతి బట్టింది."

మళ్లీ కళ్ల నీళ్లు తిరిగేయతనికి. కాసేపుకూచుని ఇంటికి వెళ్లిపోయాడు నారాయణ. అతనికి ఇంటికెళ్లాలనీ ఎవరితోనైనా మాట్లాడాలనీ లేదు. ఊరొదిలి కొడుకుతో హైదరాబాదు వెళ్లిపోతున్నాడని అందరికీ తెలిసిపోయింది. అందరూ అడగడవే. చెప్పులు గుమ్మం దగ్గిర ఒదిలి లోపలికెళ్లేడు నారాయణ. ఎవరూ అంటూ కోడలు గరిటెతో ఎదురొచ్చి అతన్ని చూసి లోపలికి వెళ్లిపోయింది. చొక్కా విప్పి గోడమేకుకి తగిలించాడు. ఒకసారి కావాలని గొంతు సవరించుకుని లోపలి గుమ్మం ఇవతలి గోడకి నెట్టిన చెక్కపెట్టె ముందు కూచున్నాడు. పొడవాటి పాత చెక్క పెట్టె ఇది. దాని మీద వెలిసిపోయిన నామాలు ఇంకా కనిపిస్తున్నాయి. పెట్టె తలుపు తెరిచి రెండుసార్లు దగ్గేడతను. నారాయణ దగ్గు ఫలించి కోడలు వంటింట్లోంచి వచ్చి గుమ్మం వెనక నిశ్శబ్దంగా నుంచుంది. కళ్లు మూసుకుని ఒకసారి దణ్ణం పెట్టి, శ్రీమన్నారాయణమూర్తి పాదాలు స్పృశిస్తున్నట్టుగా జాగ్రత్తగా భక్తిగా లోపల్నించి తంబురా, చిడతలు కంచు భిక్షాపాత్రా బైటికి తీశాడు. కోడలు ఉందని తెలుసు. అన్నీ జాగ్రత్తగా అనవసరంగా శుభ్రం చేశాడు నారాయణ. ఆమెకేవీ అర్థంకాక వంటింటోకి వెళ్లిపోయింది. కోపం వచ్చిం దతనికి. భళ్లున పెట్టె మూసేశాడు. తన నిరసన చర్యని ఆమె గుర్తించలేదు. కొడుకూ కోడలూ వచ్చిన ఈ మూడ్రోజులూ తప్ప రోజూ రాత్రిపొద్దు పోయేదాకా అరుగుమీద చాపవేసుకుని తంబుర పెట్టుకుని పాడుతూనే ఉంటాడతను. కోమటి కృష్ణమూర్తి కూడా ఇంత బువ్వతిని ఇవతలి అరుగు మీద కూచుని శ్రోతగా రాణిస్తూంటాడు. ("పుణ్యం అంతా నీదే. ఒచ్చే జన్మలో ఇష్టమూర్తి వాహనవై పుడతా.")

ఈ జ్ఞాపకాల్తో నిద్ర పట్టేసింది నారాయణకి. తను చచ్చిపోయినట్టూ గోనె సంచీలో తంబురా చిడతలతో సహా కట్టి ఊరవతల పారేసినట్టూ కలొచ్చింది. నారాయణ గోదావరి అవతల ఎమ్మార్వో ఆఫీసులో అటండరుగా పనిచేసి రిటైరయ్యాడు. ఉదయం గోదావరిలో స్నానం చేసి, నాలుగు బారలు ఈది సూర్యనారాయణమూర్తికి నమస్కరించి భార్య సర్దిన సీమవెండి కేరియరూ గొడుగూ తీసుకుని రేవు దగ్గిరికి వెళ్లేవాడతను. పొడుగ్గా, నిశ్శబ్దంగా నిటారుగా అతని నామంలా బతికేడు నారాయణ. ఏవో ఫైళ్లూ పుస్తకాలూ తీసుకుని పెద్దాయన గది నుంచి వరండా చివర పెద్ద గుమాస్తా గదికి వెడుతుంటే పాపభారాన్ని శాపవశాత్తూ మోస్తున్న గరుత్మంతుడిలా ఉండేవాడు నారాయణ. ముందుగా ఆఫీసుకొచ్చి అనేక సంవత్సరాల నుంచీ అగరుబత్తీల సిగరెట్ల పొగల్లో ఉక్కిరిబిక్కిరై పోతున్న వెంకట రమణమూర్తి ఫోటో చారికల మీద మరో అగరొత్తి వెలిగించి దణ్నం పెట్టుకుని చెప్పులేసుకుని ఆ రోజుకి తన కర్మఫలాన్ని అనుభవించడానికి తాజాగా సిద్ధమయ్యేవాడు. మళ్లీ సాయంకాలం ఇంటికెళ్లి గోదావరిలో స్నానం చేసి ఇంటికెడుతూ తులశమ్మదగ్గిర టీ కోసం ఆగేవాడతను. సాయంకాల సూర్యుడు శ్రీమన్నారాయణుడి చక్రంలాగ, మెరుస్తోన్న గోదావరి నారాయణమూర్తి కండువాలాగ భావించేవాడతను. గోదావరి అతని నరం. నాలుగు వీధులున్న ఆ గ్రామాని కతను శ్రీమన్నారాయణుడి ప్రత్యేక ప్రతినిధిలా ఉండేవాడు. నారాయణ ఒక రుతువులా ఊరికి పరిచితుడు.

పట్టణాల్లో నగరాల్లో ధనుర్మాసం బతికిచెడ్డ ఆడదాన్లా ఉంటుంది. మిగతా ఊళ్లలాకాదిక్కడ. ధనుర్మాసం ఎక్కడో అడవుల్లోంచి పచ్చగా ఊరి పాపికొండల మధ్య నుంచి చటుక్కున మీద పడ్డ హేమంతంలా గోదారి మీంచి ఊళ్లో కొస్తుంది. తెలవారకుండా ఓ వారగా గోదాట్లో స్నానం చేసే తులశమ్మకి కూడా తెలిసేది కాదు. గోదారి కొమ్మకి పూసిన బంగారు బంతి పువ్వులా ధనుర్మాసం సూర్యుడు మెరిసిపోతాడు. ఆయన్నే నెత్తిమీద పెట్టుకున్నట్టు తళతళలాడే అక్షయపాత్రలో బంతిపూలతో తంబురలో ధనుర్మాసం ఉదయాన్ని కాలికి కట్టుకున్న వెండి తీగలా అన్ని వీధులకీ తీసికెళ్లేవాడు నారాయణ. ఒంటిపూట తిని ఉద్యోగిస్తూ భోగి వరకూ అతను శ్రీమన్నారాయణునిలో బతికేవాడు. భిక్షబియ్యాన్నే ప్రసాదంలా ఒండుకు తినడం ఆచారం అతనికి.

కోటేశ్వర్రావు ఒక్కడే కొడుకు నారాయణకి. రాజమండ్రి హాస్టల్లో ఉండి ఫిట్టరు ట్రెయినింగు చేశాడతను. వాడి చిన్నప్పుడే నారాయణ హరినామాలు చెప్పడానికి ప్రయత్నించి ఊరుకున్నాడు. చిడతలు పట్టుకోడం కూడా రాలేదతనికి("బక్తిగా ఉండాలి. అంటే చెడుపన్లు చెయ్యకపోవడం. ఇయన్నీ, చిడతలూ దేవుడి ఇంటాడని గాదు. మనకోసం. నేర్చుకోవాల మరి") కానీ ఇదంతా ఈ ఒక్క విషయం నారాయణ భార్యకి నచ్చేది కాదు.

మొత్తానికి కొడుక్కి ఒక్కపాటా పద్య రాలేదు. శ్రీమన్నారాయణుడిపట్ల అతని వైముఖ్యం అర్థం కాలేదు నారాయణకి– తండ్రి దగ్గిర ఈత మాత్రం నేర్చుకున్నాడు. ఇప్పుడు ఆవలీలగా అవతలి ఒడ్డుకి చేరిపోయాడు. నారాయణ భార్య పోయి నాలుగేళ్లయింది. కొడుకు పెళ్లి తండ్రిలో గొడవపడ్డాడు కోటి.

"అయితే ఒక్కడివే ఎన్నాళ్లుంటావు?"

"ఎన్నాళ్లయితే అన్నాళ్లు. నేనేం మూలబడ్డానంటావా?"

"నీ కెవడూ చెప్పలేదు నానా. నా దగ్గిరుంటే నీకు బాదేంటి? పెద పండక్కి అడుక్కు తిని కూడా తింటేగానీ నీకు తోచదు. నీ బాద అదీ."

ఆ క్షణంలో నారాయణకి కొడుకు మీద వ్యామోహం దరిదాపు చచ్చిపోయింది. తండ్రి తాతల దగ్గిర్నించీ సంక్రమించిన దైవకార్యాన్ని అడుక్కు తినడం అంటే సహించలేక చివాల్న లేచేడు మంచం మీంచి. దనుర్మాసంలో ప్రాణంతో మిగతారోజుల్లో శరీరంతో బతుకుతాడు నారాయణ.

"అడుక్కోడంగాదు. అది దేవుడి ప్రసాదం."

"గాడిద గుడ్డు. నువ్వు ఏడిసిపోతావని నాలుగ్గింజలేస్తారు."

మర్నాట్నించీ అతను వెళ్లే వరకూ కొడుకుతో మాట్లాడలేదు. రేవు దగ్గిర కూడా ఏవీ మాట్లాడలేదు. తరవాత కొడుకు రాసే ఉత్తరాలకి ముక్తసరిగా కార్డురాసి ఊరుకునేవాడు. రోజూ సాయంత్రం తంబూర తీసుకొని పాడుకోవడం అప్పట్నుంచి కొత్త అలవాటైంది నారాయణకి. ప్రాణం పోసి తంబూరతో కళ్లు మూసుకుని తత్వాలు పాడుకుంటే ఒక్కోసారి కృష్ణమూర్తికి భయం వేసేది. పాటతో పాటు నారాయణ కూడా అయిపోతాడనుకొనేవాడు. రాత్రి కూడా కృష్ణమూర్తి శ్రోతగా తత్వాలు పాడుకుంటాడు. లావుపాటి కృష్ణమూర్తి కూడా తేలికై ఇంటి ఇంకికెళ్లేవాడు. ("ఆడు గొప్ప భక్తుడే బాబూ") ఈసారి మళ్లీ కొడుకురాకముందే ధనుర్మాసంలోనే చచ్చిపోవాలని రోజూ కోరుకునేవాడు నారాయణ. రామాలయానికి వెళ్లి ఈసారయినా దయుంచునాయనా అని రాముడికి కూడా అర్జీ పెట్టుకున్నాడు. హయిదరాబాదులో చావడానికి వీల్లేదు. హయిదరాబాదుకీ విష్ణుమూర్తికీ ఏ కోశానా సంబంధం లేదని నారాయణ నమ్మకం.

ఈసారి కోడల్ని కూడా వెంటపెట్టుకు రావడంతో గుండెల్లో బండపడింది నారాయణకి. 'నిన్ను తీసుకెల్లడానికే వచ్చేం' అన్నాడు కొడుకు. అలిగి గోదావరి గట్టుకి వెళ్లిపోయాడు నారాయణ. నారాయణుడు చక్రం పంపించి తన తలకాయ పట్టుకుపోతే బాగుండు ననుకున్నాడు. చీకటి పడుతోంది. తను ఇంక బతికుండడం దండగ.

నల్లదారపుండలో తెల్లదారంలా ఆఖరి సంజవెలుగులో స్పష్టాస్పష్టంగా ఉంది. గట్టుదిగి రామాలయానికి వెళ్లేడు. స్వామికి దణ్ణం పెట్టుకుని ప్రసాదం తీసుకుని వెళ్లబోతుంటే 'మెట్లమీద కూచోవస్తున్నా' నన్నాడు పూజారి. పూజారిగారు నారాయణవేపు దీర్ఘంగా చూశాడు.

" నారాయణా నువ్వు భక్తికోసం నేను భుక్తికోసం నమ్ముకున్న దేవుడు అంతటా ఉన్నాడు, విష్ణువు అంటే సర్వవ్యాపి అని అర్థం."

" అంటే మీరు కూడా ఊరొదిలి పొమ్మని చెప్పటానికి ఉండమన్నారు."

" అదిగాదు. నీ ఆంతర్యం తెలీని వాణ్ని కాదు. నీ భక్తి శ్రద్ధల ముందు నా మంత్రపుష్పం ఎంత? కానీ తండ్రి పెద్దాడైపోయాడు, దిక్కులేని చావు చస్తాడని బాధపడే కొడుకులు తక్కువగా ఉన్న రోజులివి. కోటిగాడు మాట్లాడేడు నాతో."

" అడుక్కు తింటున్నానంటండి. అదీ. నా ప్రాణానికి దనుర్మాసానికీ లింకె."

" నీ భక్తీ, పాటలూ, అవన్నీ వాడికెలా తెలుస్తాయి. రేప్పొద్దున్న జరకూడని దేదేనా జరిగితే ఎలా? వెళ్ళి వాడి దగ్గిర ఉండు. ఎప్పుడేనా గాలి తిరిగితే ఓసారి వచ్చి వెడుదూ గాని."

" పోతే ఒకటేపోటం లెండి. సచ్చిం తరువాత ఎవడు పూడిచి పెడతాడో తెలుస్తదా? ధనుర్మాసంలో బిక్ష, హరినామాలు పాట్టం పెద్దల దగ్గిర్నించీ వస్తా ఉంది. ఈ ఊరికి మేం చేసిందదీ."

" నిజవే. కానీ ఏం చేస్తాం? ఆలోచించు."

గుడివేపు తిరిగా దణ్ణం పెట్టుకుంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు నారాయణ.

" నారాయణా నువ్వు ఆంజనేయుడి లాంటి వాడివి పో."

ఆ రాత్రి చాలాసేపు తత్త్వాలు పాడుకుంటూనేవున్నాడు నారాయణ. ఏది పాటో ఏది ఏడుపో తెలీలేదు కోటికి. అంత పెద్ద గొంతుతో పాడటం అతను ఎప్పుడూ వినలేదు.

రెండ్రోజుల తరవాత రేవు దగ్గిరికి చాలామంది వచ్చేరు. తులశమ్మ చిన్న పిల్లలా ఏడుస్తునే ఉంది. ఇల్లు తాళం పెట్టి కృష్ణమూర్తికి ఇచ్చేడు. అవతలి ఒడ్డు చేరేవరకూ ఊరికి దణ్ణం పెడుతూ కూచున్నాడు నారాయణ. ఉదయం గోదావర్లో తనివి తీరా స్నానం చేసి ఈదుకుంటూ మధ్యకి వెళ్ళి ఆగిపోదావనుకున్నాడు నారాయణ.

రైలులాగ మూడు గదుల ఇల్లు. నారాయణకి చెక్క పడక కుర్చీ కొన్నాడు కొడుకు. ఆ కుర్చీలో పగలంతా గుమ్మం దగ్గిర కూచోడం అలవాటైంది. మొదట కొన్ని నెలలు పిచ్చెత్తినట్టయింది నారాయణకి అనుకోకుండా పక్కింటి ఆర్టీసి డ్రైవరు చిన్న

కూతురితో రెండ్రోజులు గోదావరి గురించి కబుర్లు చెప్పి ("అన్ని నీళ్ళు ఏం జేస్తారు తాతా?" మూడో రోజునుంచీ పాటలు నేర్పడం మొదలుపెట్టేడు. రోజంతా పాపకోసం చూడ్డం అలవాటైంది. సాయంత్రం ఒచ్చి నేర్చుకోడం కంటే వినేది పాప. ఇంతలో అతనికి ట్రాన్స్ఫరై పాప వెళ్ళిపోయింది. కొడుకు లాగే మనవడికి కూడా పాటిష్టంలేదు. వర్షాలొచ్చేయి. రోడ్డు మీద నీటి ప్రవాహాలు చూస్తూ కూచునేవాడు. గోదావరికి వరదొచ్చి ఉంటుందా! మనవడికి గోదావరి వరదల గురించి చెప్పేడు. కృష్ణమూర్తి రెండు కార్డులు రాశాడు. ఆ రెండూ మూడునెలల పాటు నారాయణ జేబులోనే ఉన్నాయి. నవంబర్లోనే బాగా చలి తిరిగింది. దరిదాపు పది రోజుల పాటు జ్వరం తగిలింది. జర్వం తగ్గి రెండు మెతుకులు తిన్న తరవాత ఓపిక రాగానే తెలుగు కేలెండరు చూసుకోడం మొదలు పెట్టేడు. ఒకరోజు మధ్యాహ్నం పక్కింటికి బయలుదేరుతూ కోడలు మావగార్ని చూసి ఆగిపోయింది. బాగా సన్నబడిపోయాడు. తలమీద జుట్టు సగం పైగా రాలిపోయింది. డిశంబరు నెలవేపు తీక్షణంగా చూస్తున్నాడతను. నోరు సగం తెరిచి ఉంది.

" అదీ ఈసారి పన్నెండో తేదిన పడిందన్నమాట."

" ఏటండీ?"

ఆమెవేపు అలాగే చూస్తూ ఉండిపోయాడు నారాయణ. నాలుగురోజులైం తరవాత పన్నెండో తారీకు ఉదయమే లేచి తల మీంచి స్నానంచేసి వెంకటేశ్వరుడి పటానికి దణ్ణం పెట్టుకుని చెక్క అటక మీద లుంగీల్లో చుట్టిన తంబుర బయటికి తీశాడు నారాయణ. పడక కుర్చీలో కూచుని గొంతు తగ్గించి హరినామాలు మొదలు పెట్టేడతను. తరవాతెప్పుడో భోజనానికి పిలవడానికొచ్చిన కోడలు అతన్ని చూసి గతుక్కుమంది. పడుకుని వీధి గుమ్మం వేపు చూస్తూన్నాడు నారాయణ. బుగ్గలమీంచి కన్నీళ్ళు కారుతున్నాయి.

ఓ రోజు రాత్రి తన కుర్చీ పక్కన చాప మీద కూచుని రాసుకుంటున్న మనవణ్ణి పిలిచాడు నారాయణ.

" నారాయణా."

" మంచి నీళ్ళు గావాల్నా."

" ఒద్దుగానీ నీకీ ఊళ్లో రైలు స్టేషను తెలుసా?"

" తెలుసు బస్సు నంబర్లు కూడా తెల్సు."

" రైలుల్లో మనూరు తీసికెళ్ళ గలవా?"

మనవడు నారాయణ సమాధానంగా పెద్దగా నవ్వేడు. తాత చెయ్యిమీద చెయ్యివేశాడు. వేడిగా ఉంది తాతచెయ్యి.

తెలతెల వారుతుండగా స్నానం ముగించి యధాలాపంగా అవతలి గట్టు వేపుచూసింది తులశమ్మ. ఎవరో స్నానం చేసి ఒళ్ళు తుడుచుకుంటున్నారు. ధనుర్మాసం ఒచ్చి ఇన్నాళ్లయినా నిశ్శబ్దంగా ఊళ్ళో సూర్యోదయం అవుతోంది.

"మంచి లైటు టీజెయ్యి తులశమ్మా?" అప్పటికే లేత ఎండవచ్చింది. పొయ్యిమీద కొమ్ముగిన్నె ఆవిరి కక్కుతోంది. తులశమ్మకి ముందు నోటమాట రాలేదు. బెంచీమీద తువాలు కప్పుకుని ఒణుకుతున్న నారాయణని చూసి వాటంతట అవే పెగిలేయి మాటలు.

" ఏటీ నువ్వే! ఇదేటి, ఎప్పుడొచ్చేవు?"

" ఇప్పుడే. స్నానం చేసి కృష్ణమూర్తిగారింటికి వెళ్ళి ఒస్తన్నా. టీ ఇయ్యి ముందు."

"ఏటిలా పాడైపోయావు అన్నయ్యా?"

టీ తాగి బయటికి రాగానే కళ్ళు తిరిగినట్టయింది. పదడుగులు వెయ్యిగానే రోడ్డు వెనక్కి తిరిగి అతని మీద పడ్డట్టయింది. ఒళ్లు తూలిపోతోంది. అలికిడికి తలుపు తియ్యగానే నారాయణని చూసి దెయ్యాన్ని చూసినట్టు విస్తుబోయింది కృష్ణమూర్తి భార్య. ఒక్క గంతులో బయటికి ఒచ్చేదు కృష్ణమూర్తి. అప్పటికే నామం దిద్దుకుని చిడతలు పట్టుకుని తయారుగా ఉన్నాడు నారాయణ.

" ఒంటోగాని బాగోలేదా? ఎక్కడికీ?"

నారాయణ ఏమీ మాట్లాలేదు. వీధిలోకొచ్చి అరక్షణం నిలబడి పాట అందుకుని బయల్దేరేడు. అతని నడకలాగే పాట కూడా ఒంకర్లు తిరుగుతోంది. ఒంటి మీద తువాలేసుకుని వెంట పరిగెట్టేడు కృష్ణమూర్తి.

❖ ❖ ❖